క్లుప్తంగా

నేడు పింఛన్ల పంపిణీ

కమలాపురం : మండల పరిధిలోని 7009 మంది లబ్ధిదారులకు రూ.4,69,73,000 నగదును ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ డబ్బులు పంపిణీ చేస్తామని ఎంపీడీఓ జ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటలకే సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పెరిగిన పింఛన్ డబ్బులు రూ.7వేలు అందిస్తామని ఆమె అందులో తెలిపారు. లబ్ధిదారులు ఎక్కడికి వెళ్ల వద్దని, మీ ఇంటికే వచ్చి పింఛన్ డబ్బులు అందిస్తామని ఆమె వివరించారు.

వల్లూరులో..

వల్లూరు : మండలంలో సోమవారం ఉదయం నుంచి ఎన్టీర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో విజయభాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలం మొత్తం మీద 4,398 మంది పెన్షన్ లబ్ధిదారులు వున్నారని తెలిపారు. వీరికి 72 మంది సచివాలయ సిబ్బందితో పెన్షన్ మొత్తాన్ని పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మండలంలోని పెద్దపుత్త, దుగ్గాయపల్లె గ్రామాల్లో జరిగే పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి పాల్గొంటారని తెలిపారు.

కూలిన వంతెన



రహదారి మధ్యలో కూలిన వంతెన

పెద్దముడియం : పెద్దపసుపుల–పులివెందుల గ్రామ రహదారిలోని వంతెన మధ్య భాగంలో కూలిపోవడంతో ప్రయాణికులకు, పొలాలకు వెళ్లే రైతులకు తీవ్ర ఇబ్బంది ఎదురవుతోంది. మైలవరం దక్షిణ ఉవ కాలువ పై భాగంలో ఉన్న ఈ వంతెన కూలిపోవడంతో కాలువ లోపల భాగంలో పడిపోయింది. వర్షం వస్తే పొలాల్లోని నీరు అంతా ఈ కాలువ గుండా బయటికి వెళ్లిపోవాలి. కాని నీరు పోవడానికి కూడా దారి లేకపోవడంతో వర్షం వస్తే పొలాల్లోనే నీరు నిలిచిపోయే అవకాశం ఉంది. కూలిన వంతెనకు వెంటనే మరమ్మతులు చేయాలని ప్రయాణికులు, రైతులు కోరుతున్నారు.

దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న వికలాంగుల నెట్ వర్కు అధ్యక్షుడు

పులివెందుల రూరల్ : పట్టణంలోని ప్రముఖ వస్త్ర వ్యాపారి స్వర్గీయ తలుపుల వెంకటసుబ్బారావు జయంతి సందర్భంగా ఆయన కుమారుడు సుగుణాకర్ స్థానిక ముద్దనూరు రోడ్డులో ఉన్న వికలాంగుల నెట్ వర్కు కార్యాలయంలో దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. వికలాంగుల నెట్ వర్కు అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరు సేవా దృక్పదం అలవరచుకోవాలన్నారు.

చోరీకి యత్నం

ముద్దనూరు : స్థానిక నాలుగు రోడ్ల కూడలి సమీపంలో తాడిపత్రి ప్రధాన రహదారిలోని ఓ దుకాణంలో చోరీ యత్నం జరిగింది. దుకాణం పైభాగంలోని రేకు తొలగించి చోరీకి ప్రయత్నం చేశారు. ఆదివారం ఉదయం దుకాణదారుడు వచ్చి చూసే సరికి చోరీ జరిగిందని గుర్తించాడు.

నేడు పుస్తకావిష్కరణ సభ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక నడింపల్లిలోని ఎస్‌బీ మెమోరియల్ హైస్కూల్‌లో సోమవారం ఉదయం 9 గంటలకు ఎస్‌డీఎస్ సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో కమ్యూనిస్టు నాయకుడు ఎస్.దస్తగిరిసాహెబ్ శత జయంతి ఉత్సవం నిర్వహించనున్నారు. డాక్టర్ పోలవరపు శంకరయ్య నాయుడు రచించిన సుందర కాండ విశ్లేషణం పుస్తకావిష్కరణ, ఎస్‌బీ అండ్ ఎస్‌డీఎస్, ఎస్‌ఎంహెచ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కుట్టుశిక్షణ పొందిన 40 మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లను అందించనున్నారు. ఈ కార్యక్రమంలో అవధాని నరాల రామారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి, విశ్రాంత జడ్జి ఎస్‌ఎం ఇస్మాయిల్, విశ్రాంత తెలుగు పండితులు ఏసీ దస్తగిరి, రచయిత ఖలందర్ పాల్గొంటారని ఎస్‌బీ మెమోరియల్ హైస్కూల్ కరస్పాండెంట్ ఎస్.అహ్మద్‌హుసేన్ తెలిపారు. కార్యక్రమంలో సాహితీ అభిమానులు పాల్గొనాలని కోరారు.

శేష వాహనంపై శ్రీనివాసుడు

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటం రోడ్డులోని ఫైర్ ఆఫీసు వెనుక భాగంలో ఉన్న శ్రీమహాలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ నవమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారిని శేష వాహనంపై కొలువుదీర్చి తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. దారి పొడవునా భక్తులు స్వామివారికి నీరు వారపోసి కాయకర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఉదయం నుంచి ఆలయంలో ధ్వజారోహణం, మహాకుంభ ఆరాధన, చతుస్థానార్చన వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ నిర్వాహకులు వల్లం కొండు వెంకటరమణ, ఆలయ ప్రధాన అర్చకులు వీరేశాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.సుభాషిణి



హాజరైన ఆశా కార్యకర్తలు

కమలాపురం : ఆశా కార్యకర్తలకు కనీస వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ముఖ్యంగా ఆశాలకు సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.సుభాషిణి డిమాండ్ చేశారు. ఆదివారం కమలాపురంలో నియోజకవర్గ అధ్యక్షురాలు వరలక్ష్మీ అధ్యక్షతన జరిగిన ఆశాల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్‌డీఏ కూటమి ఆధ్వర్యంలో జరిగిన అనేక బహిరంగ సభలలో సీఎం చంద్రబాబునాయుడు ఆశాలకు కనీస వేతనం అమలు చేస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తానని చేసిన వాగ్దానాలను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తలు చేసిన నిరసనలకు స్పందించిన గత ప్రభుత్వం రికార్డులు సరఫరా చేస్తామని, ఆశా మరణిస్తే మట్టి ఖర్చులకు రూ.20వేలు, సాధారణ, మెటర్నటీ శెలవులు మంజూరు చేస్తామని, రిటైర్మెంట్ వయస్సు 60–60 ఏళ్లకు పెంచుతామని చర్చల్లో చెప్పారని ఆమె గుర్తు చేశారు. వాటిని అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. గత 16 ఏళ్ల నుంచి ఆశాగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగ భద్రత లేదని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధం లేని సర్వేలను ఆశాలతో చేయిస్తున్నారని, అలాగే గళ్ల పరీక్షలు డాక్టర్ గాని ల్యాబ్ టెక్నీషియన్ చేయాల్సి ఉండగా వాటిని కూడా ఆశాలతోనే చేయిస్తున్నారని మండి పడ్డారు. ఆశాలకు రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ చేయడంతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు, పెన్షన్ వేతనంలో సగం ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఆశాలపై రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, నియోజకవర్గ కార్యదర్శి చంద్రశేఖర్, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మరియమ్మ, కల్పన, కోశాధికారి అమ్ములు, జిల్లా ఉపాధ్యక్షులు అనసూయ, నియోజకవర్గ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పాపాఘ్ని
వీరాంజనేయస్వామి తిరునాల

వల్లూరు : కడప – తాడిపత్రి ప్రధాన రహదారి పక్కన వల్లూరు మండల పరిధిలోని కట్ట బస్టాపు (పాపాఘ్ని నగర్) వద్ద వెలసిన శ్రీ పాపాఘ్ని వీరాంజనేయ స్వామి తిరునాల మహోత్సవాలు మంగళవారం నుంచి మూడు రోజుల పాటు జరుగుతాయని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం స్వామి వారికి అభిషేకాలు, విశేష పూజా కార్యక్రమాలు జరుగుతాయి. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన భజన బృందాల ఆధ్వర్యంలో తాళ భజన కార్యక్రమం జరుగుతుంది. బుధవారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయి. మధ్యాహ్నం 3 గంటలకు కోలాట ప్రదర్శన ఉంటుందన్నారు. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం, అనంతరం చెక్క భజన ప్రదర్శన ఉంటుందన్నారు.

బండ లాగుడు పోటీలు

ఉత్సవాల్లో భాగంగా గురువారం మధ్యాహ్నం 3 గంటలకు బండలాగుడు పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన ఎద్దుల యజమానులకు మొదటి బహుమతి రూ.30,016, రెండవ బహుమతి రూ.20వేలు, మూడవ బహుమతి రూ.15 వేలు, నాలుగవ బహుమతి రూ. 10 వేలు, ఐదవ బహుమతి రూ.5 వేలు, ఆరవ బహుమతి రూ.3,016 నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

పట్టణపురోభివృద్ధికి స్వచ్ఛంద సంస్థల సేవలు అవసరం



విద్యార్థులకు నగదును అందజేస్తున్న కమిషనర్

పులివెందుల టౌన్ : పట్టణ పురోభివృద్ధిలో మానవతా స్వచ్ఛంద సంస్థ భాగస్వామ్యం అవసరమని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. ఆదివారం మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ పురోభివృద్ధిపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. మానవతా సంస్థ మాకు సహాయ సహకారాలు అందించాలన్నారు. అనంతరం నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన నాగరిషిత, ఐశ్వర్య, జస్వంత్‌లకు దాత చవ్వా కృష్ణారెడ్డి అందించిన రూ.10 వేలను కమిషనర్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ కొండారెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బరాయుడు, చంద్రశేఖర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు : మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు ఎంతో అవసరమని ఆ సంస్థ కేంద్ర కమిటీ సభ్యుడు టాటాల గోపి తెలిపారు. స్థానిక రామాలయంలో ఆదివారం మానవతా సంస్థ నూతన కార్యవర్గ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చెన్నూరు మండలం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మాజీ అధ్యక్షుడు జి.ఎస్. భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో టాటాల గోపి మాట్లాడుతూ చెన్నూరు మండలంలో 350 మంది సంస్థ సభ్యులుగా ఉండటంతో ఆయన హర్షం వ్యక్తం చేశారు. మానవతా సేవా సంస్థ సభ్యులు మాట్లాడుతూ 2018లో మానవతా సంస్థను రామచంద్రారెడ్డి స్థాపించారని రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలకు కూడా మానవతా సంస్థ సేవలందిస్తోందన్నారు. చెన్నూరు మండలం మానవతా సంస్థ అధ్యక్షుడిగా ఆవులబసిరెడ్డి, కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య, కోశాధికారి పెడబల్లె నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడిగా నీలం శ్రీనివాసులురెడ్డిలను ఎన్నుకున్నారు. అనంతరం మానవతా సంస్థకు దాతలుగా సహకరించిన రామనపల్లె గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ శ్రీలక్ష్మి, చెన్నూరు పడమటి వీధికి చెందిన జి. చాణిక్య, ఆటో బాబులను ఘనంగా సన్మానించారు.

వైభవంగా ఉరుసు మహోత్సవం



ప్రత్యేక ఫాతెహా చేస్తున్న భక్తులు

కమలాపురం : మండల పరిధిలోని కోగటం గ్రామంలో వెలసిన శ్రీ సయ్యద్ షా ఆలంపీర్ ఖుద్దస సిర్రహు వారి ఉరుసు మహోత్సవం వైభవంగా జరిగింది. రెండు రోజులుగా కీ.శే. గండ్లూరి పెద్ద వీరారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ఉరుసు కార్యక్రమాలు ఆదివారంతో ముగిసాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారి మజార్‌పై పూలచాదర్లు సమర్పించి ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

భక్తి శ్రద్ధలతో జెండా ఊరేగింపు :

ఉరుసు మహోత్సవాన్ని పురస్కరించుకుని కీ.శే. మోపూరి యల్లారెడ్డి నివాసం నుంచి జెండా ఊరేగింపు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పకీర్ల మేళ తాళాలతో, డప్పు వాయిద్యాల నడుమ బాణా సంచా పేల్చుతూ జెండా ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఊరేగింపులో యువత వివిధ రకాల నృత్యాలు నిర్వహించారు. ఊరేగింపు దర్గా చేరుకున్న అనంతరం అక్కడే ప్రతిష్టించారు. రాత్రి అన్నదానం ఏర్పాటు చేశారు.

అలరించిన ఖవ్వాలీ పోటీ:

సయ్యద్ షా ఆలంపీర్ ఉరుసు మహోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఖవ్వాలీ పోటీ భక్తులను విశేషంగా అలరించింది. రాత్రి ఆగ్రాకు చెందిన ఖాసీం హనీఫ్ సాబ్రి ఖవ్వాల్, నాగ్‌పూర్‌కు చెందిన మొహిసిన్ చిష్టి ఖవ్వాల్‌ల మధ్య జరిగిన పోటీ రసవత్తరంగా సాగింది. తెల్లవారు జామున వరకు సాగిన ఖవ్వాలీ పోటీలో భక్తులు ఖవ్వాల్‌లకు తమ వంతు నజరానా అందజేశారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవం

మైదుకూరు : మున్సిపాలిటీ పరిధిలోని పాలెంలో సీఎస్ఐ చర్చి మూడవ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేడుకలలో ముఖ్య అతిథిగా సీఎస్ఐ డయాసిస్ బిషప్ డాక్టర్ ఐజక్ వరప్రసాద్, భారతమ్మ దంపతులు పాల్గొన్నారు. వారిని శాంతినగర్ సీఎస్ఐ చర్చి పాస్టర్ వినయ్ బాబు, పాలెం చర్చి సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. చర్చి వార్షికోత్సవం సందర్భంగా కోలాటాలు, చెక్క భజన ఊరేగింపుతోపాటు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో రాయలసీమ డయాసిస్ గురువులు, సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులకు ఉచితంగా వైద్యం అందిస్తున్న వైద్యులు

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలోని మేరిమాత చర్చిలో ఆదివారం చాగలమర్రికి చెందిన క్రిస్టియన్ ఫెలోషిప్ ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆసుపత్రికి చెందిన వైద్య నిపుణులు డాక్టర్ ప్రకాష్ ఇమ్మ్యానియల్, డాక్టర్ అనితలు రోగులను పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో మిషనరీ రెవరెండ్ ఎస్.సుమేష్, పాస్టర్లు పాల్గొన్నారు.

హిందూ ధర్మం ఎంతో గొప్పది

ప్రొద్దుటూరు కల్చరల్ : హిందూ ధర్మం ఎంతో గొప్పదని, ప్రపంచ శాంతికి మూలం హిందూధర్మమే అని శృంగేరి శారదాపీఠం ఆస్థాన పండితుడు డాక్టర్ బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి పేర్కొన్నారు. స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఆదివారం నృసింహవైభవం– ప్రహ్లాద చరిత్రపై ప్రవచనాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూధర్మం భారతదేశంలో సుస్థిరంగా ఉన్నంతకాలం ఈ ప్రపంచం బాగుంటుందన్నారు. ఎలా పుట్టాలో రామాయణం చెబుతుంది, ఎలా ధర్మబద్ధంగా బతకాలో భారతం తెలియచేస్తుందని, ప్రశాంతంగా ఎలా మరణించాలో భాగవతం వివరిస్తుందని ఈ గ్రంధాల ప్రాముఖ్యతను వివరించారు. సృష్టికి మూలం భగవంతుడే అని, నిజమైన భారతీయ యువకుడు ఎలా ఉండాలో ప్రహ్లాదుని పాత్ర ద్వారా వ్యాసుడు మనకు అందించారన్నారు. అనంతరం సంతోష్ కుమార్ శాస్త్రిని ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామమోహన్‌రావు, ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ రవీంద్రబాబు, కార్యదర్శి నాగేశ్వరరావు, ఆర్యవైశ్యసభ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి సీపీఎం శిక్షణ తరగతులు

బద్వేలు అర్బన్ : జూలై 1, 2 తేదీల్లో కడప నగరంలో జరగనున్న సీపీఎం జిల్లాస్థాయి రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్ కోరారు. ఆదివారం పట్టణంలోని సుందరయ్య భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే ఈ శిక్షణా తరగతులకు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎం.ఎ.గఫూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్, రాష్ట్ర కమిటీ సభ్యుడు కందారపు మురళి, జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో సీపీఎం బద్వేలు రూరల్ కన్వీనర్ వెంకటేష్, రూరల్ నాయకులు రమణ, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

డయేరియా వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు

గోపవరం : మండలంలోని రాచాయపేటలో డయేరియా వ్యాధి బారిన పడిన వారిని గుర్తించి వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. 'రాచాయపేటలో డయేరియా' అనే శీర్షికతో ఆదివారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన మండల వైద్యాధికారులు మహేశ్వర్‌రెడ్డి, మురళీకృష్ణలు వైద్య సిబ్బందితో కలిసి గ్రామంలో ఇంటింటికి వెళ్లి డయేరియా వ్యాధి బారిన పడిన వారిని గుర్తించి వారికి వైద్యసేవలు అందించారు. అలాగే తాగునీటికి ఉపయోగించే ట్యాంకులను పరిశీలించారు. ట్యాంకుల వద్ద లీకేజీలను గుర్తించి బ్లీచింగ్ చల్లించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఎస్సీకాలనీలో ఉన్న రెండు ట్యాంకులను పారిశుధ్య సిబ్బంది ద్వారా శుభ్రం చేయించారు. ఇకమీదట ప్రతి మూడు నెలలకొకసారి తాగునీటి పథకాలను శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటామని వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ గౌస్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

టూ వీలర్ మెకానిక్‌లకు ఆర్థిక సాయం

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని టూ వీలర్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున ఇరువురు మెకానిక్‌లకు ఆర్థిక సాయం అందజేశారు. మైదుకూరు రోడ్డులోని టూ వీలర్ మెకానిక్ రజాక్ కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. విషయం తెలుసుకున్న ప్రొద్దుటూరు టూ వీలర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అయూబ్, వైస్ ప్రెసిడెంట్ గాలి శివతో పాటు సభ్యులు ఆదివారం రజాక్‌ను పరామర్శించారు. ఆస్పత్రి ఖర్చులకు రూ. 25,500 నగదు అందజేశారు. అలాగే సినీహబ్ సమీపంలోని మెకానిక్ షాపు నిర్వహిస్తున్న మడూరు బాషాకు చెందిన బంక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో పూర్తిగా దెబ్బతింది. అసోసియేషన్ సభ్యులు అక్కడికి చేరుకొని బాధితుడికి రూ. 10 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరి రమణ, ట్రెజరర్ ఫరూక్, గోపాల్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా కోట పోలేరమ్మ జాతర

పోరుమామిళ్ల : మండలంలోని తిమ్మారెడ్డిపల్లె పంచాయతీ పెద్ద కప్పలపల్లెలో ఆదివారం కోట పోలేరమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. గ్రామ మహిళలు బోనాలు తలపై పెట్టుకుని, వేపమండలతో ఊరేగింపుగా బయలుదేరారు. తప్పెట్ల మోతలు, చిందులు ఊరేగింపులో కనువిందు చేశాయి. మొక్కుబడులున్న వారు మేకపోతులు, కోడిపుంజులతో పోలేరమ్మ గుడికి చేరుకున్నారు. గుడి వద్ద అమ్మవారికి బోనాలు సమర్పించి, ఈ సంవత్సరం వానలు సమృద్ధిగా కురవాలని పోలేరమ్మను వేడుకున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యం చేస్తున్న చిన్నారులు

పులివెందుల టౌన్ : స్థానిక ఉలిమెల్ల రోడ్డులోని ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. నంది అవార్డు గ్రహీత మానస నృత్య కళా కేంద్రం దర్మవరం వారి శిష్యబృందం చే శాస్త్రీయ, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. సినిమా పాటలకు విద్యార్థులు నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఎర్రగుంట్ల : మండల పరిధి చిలంకూరులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఈ పాఠశాలలో చదివిన 1986–87 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. అప్పటి ఉపాధ్యాయులను వారు ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులందరు వారి చిన్ననాటి తీపు గుర్తులను గుర్తు చేసుకుంటు సంతోషంగా గడిపారు.

ముగిసిన అమ్మవారి వార్షికోత్సవ వేడుకలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



అమ్మవారికి చల్ల ముద్దలను సమర్పిస్తున్న భక్తులు

ఎర్రగుంట్ల : పట్టణంలోని శాంతినగర్ కాలనీలో వెలసిన ఏరువాక గంగమ్మతల్లి వార్షికోత్సవ వేడుకలు ఘనంగా ముగిశాయి. ఆదివారం ఈ వేడుకలు పురస్కరించుకుని అమ్మవారికి చల్ల ముద్దలను సమర్పించారు. భక్తులు భక్తి శ్రద్ధలతో అమ్మవారికి చల్ల కుండలను ఆలయం ప్రాంగణంలోని ఊరేగింపు చేసి అమ్మవారికి చల్ల ముద్దను పెట్టారు.

అనంతరం బోనాలు సమర్పించారు. ఈ వేడుకలలో వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారికి వివిధ రూపాలలో కానుకలు అందజేశారు.